

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 28 | ఎడిటర్ : బరిగెల శివ | సోమవారం 29, డిసెంబర్ 2025 | పేజీలు 6 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్




# తెలంగాణ ఆత్మగౌరవాన్ని అణచివేస్తున్నారు !




**మీడియాపై కఠిన ఆంక్షలతో కదం తొక్కుతున్న ప్రభుత్వం**

**రాష్ట్ర ప్రెస్ అకాడమీ నిర్ణయాలతో ఎవరికి మేలు చేస్తున్నారు**

**సుప్రీంకోర్టులోనే మీడియాకు ఆంక్షలు లేవు**

**అసెంబ్లీకి ఆంక్షలు విధించడం సిగ్గుకరం**

**పాలకుల అవినీతి మోసాలను ప్రశ్నిస్తున్నందునే మీడియాను అణిచివేస్తున్నారు**

**మీడియాపై ప్రభుత్వ జవాబుదారితనం బట్టబయలైంది**

**ప్రశ్నించే వాళ్లను పూర్తిగా అణచివేస్తున్నారు**

**దేశ రక్షణ కోసం ప్రశ్నిస్తున్న రాహుల్ గాంధీ రాష్ట్ర పాలకులకు కనిపిస్తలేరా !**

**ఎస్సీ,ఎస్టీ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను పూర్తిగా పక్కన పెట్టారు**

**లూప్ లైన్ పోస్టులతో సతమతమవుతున్న ఎస్సీ ఎస్టీ అధికారులు : డాక్టర్ బరిగెల శివ**

హైదరాబాద్ జై భీమ్ డెస్క్ :

తెలంగాణలో ఆత్మగౌరవంతో బతకాలంటే అణచివేతను భరించాలని డాక్టర్ బరిగెల శివ అన్నారు.అవమానాలను అణిచివేతలను తట్టుకొని జర్నలిజం వృత్తిలో కొనసాగుతున్నప్పటికిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కక్ష సాధింపులు చివరకు జర్నలిస్టులను కూడా వదిలేలా లేవని అట్టి కక్ష సాధింపు చర్యలు దినదినానికి పెరిగిపోతున్నాయన్నారు.నేటి నుండి జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలకు 15 సంవత్సరాల అనుభవం కలిగిన మీడియా సంస్థలకు మాత్రమే అసెంబ్లీ సమావేశాలకు ఆహ్వానం ఉందని ప్రభుత్వం తరపున ప్రెస్ అకాడమీ తరఫున ఆంక్షలు విధించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడే 12 సంవత్సరాల 5 నెలల 27 రోజులు అవుతుండగా మీడియా సంస్థలకు తెలంగాణ రాష్ట్రంలో 15 సంవత్సరాల అనుభవం ఎక్కడికెళ్లి పరిగణలోకి తీసుకున్నారో రాష్ట్ర ప్రెస్ అకాడమీ ప్రతినిధులకు,తెలంగాణ రాష్ట్ర మంత్రి - మిగతా 4లో..



## పట్టాదారుల ప్రాణాలు తోడేస్తున్నారు

**మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారు**

**పట్టదారులు వందల ఆధారాలు చూపిస్తున్న మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నారు**

**విచారణ లేకుండానే పట్టుదారులను ముంచేస్తున్నారు**

**భూకబ్జాదారులతో ప్రహరీ గోడలు భవనాలు నిర్మింప చేస్తున్నారు**

**మున్సిపల్ అధికారులే దగ్గరుండి కబ్జా నిర్మాణాలను పెంచి పోషిస్తున్నారు**

**మున్సిపల్ కమిషనర్‌కు అర్జి పెట్టుకుంటే న్యాయం కన్నా అన్యాయం ఎక్కువ జరుగుతుంది**

**జిల్లా కలెక్టర్, జెసి, ఆర్డిఓ ఎమ్మార్వో నివేదికలను కాలిన బూడిదతో సమానంగా చూస్తున్నారు**

2

## తెలంగాణ అసెంబ్లీ సెక్రటరీని కలిసిన జై భీమ్ సంస్థల ఛైర్మేన్

**అసెంబ్లీ సమావేశాలతో తెలంగాణ ప్రజలకు మేలు జరగాలి**

**ప్రజా విశ్వాసం బలపడే విధంగా అసెంబ్లీ సమావేశాలను తీర్చిదిద్దాలి**

హైదరాబాద్ జై భీమ్ డెస్క్:-

తెలంగాణ శాసనసభ సమావేశాలకు గౌరవం తెచ్చి పెట్టేలా చోరువ చూపాలని తెలంగాణ అసెంబ్లీ సెక్రటరీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన తిరుపతిని జై భీమ్ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ బరిగెల శివ మర్యాద పూర్వకంగా కలిసి తెలియజేశారు.అసెంబ్లీ సమావేశాలను సమన్వయపర్చడంలో క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుండగా నూతనంగా నియమితమైన సెక్రటరీ తిరుపతి అన్ని విధాల తను నిర్వహించబోయే బాధ్యతలను సమం ధ్వంతంగా చేయగలరని ఆశాభావం వ్యక్తపరిచారు.



## కాళ్లు మొక్కినా దక్కని యూరియా..!

వివరాలు 2లో

## సంగారెడ్డి ఫ్యాక్టరీ ప్రమాదం ఆరు నెలల తర్వాత సిగాచి ఎండీ అరెస్ట్

వివరాలు 5లో




## తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం..!

హైద్రాబాద్, 28 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)

తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధమవుతోంది. గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తికావడంతో, ఇప్పుడు మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్ల ఎన్నికలు నిర్వహిం చేందుకు ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనకు ముందే రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతుండగా, ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ముమ్మరం చేసింది. పట్టణ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, మౌలిక వసతుల స్థితి, స్థానిక - మిగతా 2లో..

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem సమస్యల్లో సమరంగా సామాన్యుడి ఆయుధంగా

# సౌత్ జోన్ అంతర్విశ్వవిద్యాలయ బాస్కెట్‌బాల్ పోటీలకు కేయూ మహిళల జట్టు ఎంపిక



**హన్మకొండ, 28 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

2025-26 విద్యా సంవత్సరానికి గాను కాకతీయ యూనివర్సిటీ మహిళల బాస్కెట్‌బాల్ జట్టు సౌత్ జోన్ అంతర్విశ్వవిద్యాలయ టోర్నమెంట్‌లో పాల్గొననుంది. ఈ పోటీలు బెంగళూరులోని క్రిస్టియన్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 29 నుంచి 2026 జనవరి 2 వరకు నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ వై. వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఈ టోర్నమెంట్‌కు కాకతీయ విశ్వవిద్యాలయాన్ని ప్రాతినిధ్యం వహించనున్న మహిళల బాస్కెట్‌బాల్ జట్టుకు 12 మంది క్రీడాకారిణులను ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. ఎంపికైన క్రీడాకారిణులు డీ. హర్షిత, జి. శ్రీవాణి, పి. సృజన, ఎం. సానియాన, ఈ. అనన్య తేజ (కిట్స్, వరంగల్), చె. తులసి (నాలంద డిగ్రీ కాలేజ్, మహబూబాబాద్), బి. రాధిక, బి. అఖిల (యూసిపిఈ, కేయూ), బి. వాణి, డి. పూజిత (ఎస్.సి.డబ్ల్యూ.డి.సి, కొత్తగూడెం), కె. రచన, జి. అనిత (వీసిపిఈ, బొల్లికుంట). ఈ జట్టుకు బొల్లికుంటలోని వాగ్దేవి ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ సయ్యద్ యాసీన్ కోచ్ గా మేనేజర్‌గా వ్యవహరించనున్నారని తెలిపారు. ఈ పోటీల్లో కాకతీయ విశ్వవిద్యాలయ మహిళల జట్టు ఉత్తమ ప్రతిభ కనబర్చి యూనివర్సిటీకి మంచి పేరు తీసుకురావాలని యూనివర్సిటీ అధికారులు ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్ అంబేద్కర్ విగ్రహం సెంటర్ వద్ద ఘనంగా కాంగ్రెస్ పార్టీ జెండా ఆవిష్కరించి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ కేవలం ఒక రాజకీయ పార్టీ మాత్రమే కాదు, అది ఒక గొప్ప చరిత్ర బ్రిటీష్ వారిని గద్ద నుంచి తరిమికొట్టి, దేశానికి స్వేచ్ఛను ప్రసాదించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. మహాత్మా గాంధీ, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభభాయ్ పటేల్, మౌలానా అబుల్ కలాం ఆజాద్ వంటి మహనీయుల త్యాగాల పునాదుల మీద ఈ పార్టీ నిర్మించబడిందన్నారు. మన తెలంగాణ ప్రజల దశాబ్దాల కల నెరవేర్చిన ఘనత సోనియా గాంధీదే అన్నారు. రాష్ట్రం ఇస్తే పార్టీ నష్టపోతుందని తెలిసినా, మాట తప్పని నాయకురాలిగా ఆమె తెలంగాణను ఏర్పాటు చేశారు. నేడు మన ప్రభుత్వం రాష్ట్రంలో అమలు చేస్తున్న ఆరు గ్యారంటీలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయన్నారు. పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న ప్రతి కార్యకర్తే కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక అని అన్నారు. రాబోయే రోజుల్లో ఐనవోలు మండలంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేద్దామన్నారు. అహంకారం లేని నాయకత్వం, అంకితభావం కలిగిన కార్యకర్తలు ఉన్నంత వరకు కాంగ్రెస్ పార్టీకి తిరుగులేదన్నారు. దేశ సమగ్రతను కాపాడటానికి, ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి మనమంతా పునరంకితం అవుదాం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల ముఖ్య నాయకులు, స్థానిక ఎన్నికలలో ప్రజాప్రతినిధులుగా గెలుపొందిన సర్పంచులు, ఉప సర్పంచ్లు, వార్డు మెంబర్ సభ్యులు, అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, యూత్ కాంగ్రెస్ నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీకి వెన్నుముక అయినటువంటి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం చేసిన మధుచంద్ర గౌడ్

**ఐనవోలు : (జై భీమ్ న్యూస్)**

ఐనవోలు అయ్యన్న కాకతీయ ఆటో డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఐ పస్తం శ్రీనివాస్ కలిసి ఐనవోలు గ్రామ కాంటెస్టెంట్ సర్పంచ్ మాజీ ఎంపిటిసి బోల్లెపెల్లి మధుచంద్రగౌడ్ ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కారించి ఆలయ ఆవరణలో ఆటో అడ్డ ఏర్పాటు చేసి జీవనోపాధిలో తన వంతు సహాయ సహకారాలు అందించారు.



# తెలంగాణ మున్సిపల్ ఎన్నికలకు రంగం సిద్ధం..!

మొదటి పేజీ తరువాయి

సమస్యలే ప్రధాన అజెండాగా మారనున్నాయి. అధికార పార్టీ తన పాలనా విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుండగా, ప్రతిపక్షాలు ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో పట్టణ రాజకీయ వాతావరణం క్రమంగా వేడెక్కుతోంది.

**ఫిబ్రవరిలోనే ఎన్నికలు..**

2026 ఫిబ్రవరిలో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. ఫిబ్రవరి తొలి వారంలో ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి, నెలాఖరులోగా పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. రాష్ట్రంలోని మెజారిటీ మున్సిపాలిటీల పాలక మండళ్ల గడువు 2025 జనవరి 26తో ముగియడంతో, అప్పటి నుంచే ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. ప్రజాస్వామ్య పద్ధతిలో కొత్త పాలక మండళ్లను ఎన్నుకోవాలన్న దిశగా ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. ఈ మేరకు ఓటర్ల జాబితాల సవరణ, వార్డుల వారీగా విభజన వంటి ప్రక్రియలపై ఎన్నికల సంఘం ఇప్పటికే దృష్టి సారించింది. మున్సిపల్ ఎన్నికలకు ప్రధాన అడ్డంకిగా ఉన్న బీసీ రిజర్వేషన్ల అంశం కోర్టులో ఉన్నందున, అధికారికంగా రిజర్వేషన్లు అమలు చేయడం సాధ్యం కాకపోవడంతో, పార్టీ పరంగా అభ్యర్థులను ఖరారు చేసి ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. సంక్రాంతి పండగ అనంతరం, జనవరి మధ్యలో మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. విద్యార్థుల వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకుని, ఫిబ్రవరిలో మూడు విడతల్లో పోలింగ్ నిర్వహించి, మార్చి నాటికి ఎన్నికల ప్రక్రియను ముగించాలన్న యోచనలో ప్రభుత్వం ఉంది.

**కాంగ్రెస్‌కు అగ్నిపరీక్ష..**

ఈ మున్సిపల్ ఎన్నికలు అధికార కాంగ్రెస్ పార్టీకి అగ్నిపరీక్షగా మారనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తన పట్టును నిరూపించుకున్నామని కాంగ్రెస్ భావిస్తుండగా, పట్టణాల్లోనూ అదే స్థాయిలో పట్టు సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మరోవైపు బిఆర్ఎస్, బీజేపీ పార్టీలు తమ సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాయి. పట్టణ పాలనపై ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించే ఈ ఎన్నికలు, అధికార%-%ప్రతిపక్షాలకు ప్రతిష్ఠాత్మకంగా మారనున్నాయి. ఈ ఎన్నికలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించిన నేపథ్యంలో, రానున్న రోజుల్లో రాష్ట్ర రాజకీయాలు మరింత ఉత్కంఠభరితంగా మారనున్నాయి.

# పట్టాదారుల ప్రాణాలు తోడేస్తున్నారు






**మున్సిపల్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు కబ్జాదారులకు సహకరిస్తున్నారు**

**పట్టదారులు వందల ఆధారాలు చూపిస్తున్న మొండి వైఖరిని ప్రదర్శిస్తున్నారు**

**విచారణ లేకుండానే పట్టదారులను ముంచేస్తున్నారు**

**భూకబ్జాదారులతో ప్రహరీ గోడలు భవనాలు నిర్మింప చేస్తున్నారు**

**మున్సిపల్ అధికారులే దగ్గరుండి కబ్జా నిర్మాణాలను పెంచి పోషిస్తున్నారు**

**మున్సిపల్ కమిషనర్‌కు ఆర్జి పెట్టుకుంటే న్యాయం కన్నా అన్యాయం ఎక్కువ జరుగుతుంది**

**జిల్లా కలెక్టర్, జెసి, ఆర్డిఓ ఎమ్మార్వో నివేదికలను కాలిన బూడిదతో సమానంగా చూస్తున్నారు**

**గ్రేటర్ వరంగల్ జై భీమ్ న్యూస్:-**

గ్రేటర్ వరంగల్ పరిధిలో గల 2వ డివిజన్లోని గుండ్ల సింగారం గ్రామంలో సర్వేనెంబర్ 1/1 భూమికి సంబంధించిన పట్టాదారులను కాజిపేట్ టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు తీవ్రంగా వేధిస్తున్నారని పట్టాదారులు మనోవేదన చెందుతున్నారు. సాధారణంగా ప్రతి సోమవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనరేట్ కార్యాలయంలో గ్రీవెన్స్ వినతులకు అవకాశం ఉంటుండగా ముస్లిం పట్టదారులైన భూహక్కుదారులు వాళ్ల భూమిలో నిర్మితమవుతున్న అక్రమ నిర్మాణాలను కట్టడి చేయడం కోసం వాటికి సంబంధించిన బిల్డింగ్ అనుమతులను రద్దు పరచడం కోసం పలుమార్లు వినతి పత్రాలు పెట్టుకొని వాటికి సంబంధించిన ఆధారాలను పూర్తిగా జతపరుస్తూ న్యాయం చేయాలని కోరుతున్నప్పటికిని కింది స్థాయి అధికారులైన టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు ఏమాత్రం మౌఖిక భూ విచారణ చేయకుండా భూ కబ్జాదారులకు సహకరించడం కోసం కంకణ బద్ధులై విచారణ పేరుమీద ఆలస్యం చేస్తూ పట్టాదారులకు ఉండబడిన రెండు ఎకరాల భూమిలో పూర్తిగా ప్రహరీ గోడా కట్టింపజేసి బిల్డింగులను నిర్మింప చేస్తూ...... జిల్లా జాయింట్ కలెక్టర్ రద్దుపరిచిన హద్దులు లేని సాదా పేపర్ కు చెందిన భూమిలో ఏం చక్క షెడ్లు వేయిస్తూ బిల్లింగ్ ఇన్స్పెక్టర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఇద్దరు పట్టాదారుల ఉసురు పోసుకుంటున్నారని పట్టదారులైన సయ్యద్ మాసుమా ఫర్వీణ్,సయ్యద్ ఖలీల్, సయ్యద్ ఇబ్రహీం తోపాటు కుటుంబ సభ్యులు తీవ్రంగా వేదనపడుతున్నారు. మున్సిపల్ అధికారులకు ఆర్జి పెట్టుకుంటే న్యాయం జరుగుదేమోనని ఎంతో మనోధైర్యంతో ఉన్నటువంటి ముస్లిం పట్టాదారులకు కొండంత భారం నెత్తిన పడ్డట్లుగా టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారులు లంపెన్ ఆధారాలను పరిగణలోనికి తీసుకుంటూ ఎలాంటి విచారణ కొనసాగించకుండా పట్టాదారులకు వ్యతిరేకమైన ఇంటిమేషన్ కాపీలను సిద్ధపరిచి నేరుగా భూకబ్జాలకు సహకరిస్తున్నారని మండిపడుతున్నారు. టౌన్ ప్లానింగ్ సెక్షన్ అధికారుల తీరును పరిశీలిస్తుండగా వాళ్ళు అధికారులు కారని కేవలం భూకబ్జాదారులకు సహకరించడం కోసం వ్యాపార రూపంలో తిరుగుతున్న ప్రైవేటు వ్యక్తుల లాగా ప్రవర్తిస్తున్నట్లుగా భూకబ్జాదారులు ఏది చెబితే అదే కరెక్ట్ అనే విధంగా ప్రవర్తిస్తుండడం అధికారత్వానికి పూర్తి భిన్నంగా కనిపిస్తుంది. జిల్లా రెవెన్యూ అధికారులు పలుమార్లు విచారణ చేసి ముస్లిం పట్టదారులకు అనుగుణంగా పలు నివేదికలు, ఉత్తర్వులను మంజూరు చేయగా. వాటిని సవాల్ చేస్తూ కోర్టులను ఆశ్రయించిన సదరు భూకబ్జాదారుడు అతనికి చెందిన మహిళలు కోర్టు కేసులు పెండింగ్లో ఉండగా మున్సిపల్ అధికారులకు అట్టి కేసుల విషయం తెలియపరచకుండా 2022 సంవత్సరం నుండి బిల్డింగ్ అనుమతులు పొందుకుంటు అక్రమంగా నిర్మాణాలు చేపడుతూ ప్రహరీ గోడలు కడుతూ పట్టాదారులకు తీవ్రమైన ఆస్తి నష్టాన్ని వాటిల్లచేస్తున్నారు. కేవలం ఒకే ఒక భూకబ్జాదారుడు పోలీస్ మున్సిపల్ రెవెన్యూ రిజిస్ట్రేషన్ కోర్టులను ధిక్కరిస్తూ, శాసిస్తూ మభ్యపెడుతూ తప్పుతోపట్టిస్తూ అక్రమంగా బిల్డింగ్ ల మీద బిల్డింగులు కట్టుకుంటూ పోతుంటే మేమేం తక్కువ కాదంటూ బిల్లింగ్ ఇన్స్పెక్టర్ అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఇరువురు కబ్జానిర్మాణాలకు కాపలాదారులు లాగా వ్యవహరిస్తూ దొంగ ఇంటిమేషన్ కాపీలను సిద్ధపరుస్తుండడమే కాకుండా పట్టాదారులను సుమారు వందసార్లు కార్యాలయం చుట్టూ తిప్పుకుంటూ పట్టాదారులను బెదిరిస్తుడమే కాకుండా వాళ్ల దిక్కున్నకాడ చెప్పుకోపోండంటూ మున్సిపల్ అధికారులు మా ఇష్టం వచ్చింది చేస్తాం మీరు కోర్టుకుపోండంటూ బెదిరిస్తున్న తీరు అధికారం ముసుగులో కొనసాగిస్తున్న వ్యాపారాలను వెలుగులోనికి తెస్తుంది. ఒకవైపు సిటీ ప్లానర్ను తప్పుతోవపట్టిస్తూ మున్సిపల్ కమిషనర్ను తప్పుతోవపట్టిస్తూ గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ లీగల్ సెల్ అధికారుల పేర్లు ఉచ్చరిస్తూ తప్పుడు ఇంటిమేషన్ కాపీలను సిద్ధపరిచి ఖాజీపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ తో సంతకం చేయించి పట్టాదారుల మొఖాన కొట్టారు. విచారణ లేకుండా ఇలా అన్యాయం చేశారేంటంటూ డిప్యూటీ కమిషనర్ ను పట్టాదారులు అడుగగా తనకు ఏం తెలియదు అంటూ గుడ్డిగా సంతకం చేశానని అంతా అసిస్టెంట్ సిటీ ప్లానర్ బిల్లింగ్ ఇన్స్పెక్టర్ రాసుకొని వచ్చారని దానిని ఏ మాత్రం చూడకుండా సంతకం చేసానన్నారు. ఈ విధంగా కోర్టు కేసులలోని భూములకు అనుమతులు ఇవ్వడమే కాకుండా భవనాలు కట్టిస్తూ ప్రహరీ గోడలు కట్టిస్తూ పట్టాదారులను అరిగోసపెట్టుకుంటూ పోలీస్ స్టేషన్లో కేసులు పెట్టిస్తున్న భూకబ్జాదారులను మున్సిపల్ అధికారులను ఏ విధంగా కట్టడి చేయాలో దిక్కుతోచక ముస్లిం పట్టాదారులు హరిగోశపడుతున్నారు.

**కబ్జా భూముల్లో అధికారులదే కీలకపాత్ర త్వరలో..**

# కాళ్లు మొక్కినా దక్కని యూరియా..!

**"బాంచన్.. ఒక్క బస్తా ఇప్పించండి" అంటూ కాళ్లమీద పడిన రైతులు**

**మహబూబాబాద్ జిల్లాలో యూరియా పంపిణీ వద్ద ఉద్రిక్తత**





**మహబూబాబాద్ జిల్లా, 28 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

యూరియా కొరత రైతుల సహనాన్ని తీవ్రంగా పరీక్షిస్తోంది. సాగు కాలం అత్యంత కీలక దశలో ఉండగా, ఎరువులు దొరకక రైతులు అగచాట్లు పడుతున్నారు. డోర్నకల్ నియోజకవర్గం పరిధిలోని నర్సింహులపేట బస్తారాంతండాకు చెందిన రైతులు యూరియా కోసం తీవ్రంగా వేడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. "కాళ్లు మొక్కుతాం.. బాంచన్ ఒక్క బస్తా యూరియా ఇప్పించండి" అంటూ రైతులు కాళ్లమీద పడే స్థాయికి పరిస్థితి దిగజారడం హృదయవిదారకంగా మారింది. మహబూబాబాద్ జిల్లా సీరోల్ మండలం కాంపల్లి గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) వద్ద యూరియా పంపిణీ సందర్భంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. తెల్లవారుజామున నుంచే వందలాది మంది రైతులు బారులు తీరి వేచి ఉండగా, సరఫరా తక్కువగా ఉందని చెబుతూ ఒక్క రైతు కార్డుకు ఒక్క యూరియా బస్తా మాత్రమే ఇస్తాం అని పంపిణీదారులు ప్రకటించారు. దీంతో రైతుల్లో తీవ్ర అసంతృప్తి చెలరేగి, క్యూలైన్ వద్ద తోపులాటలు చోటుచేసుకున్నాయి. ఎలాంటి పోలీస్ బందోబస్తు, క్రమబద్ధమైన క్యూవ్యవస్థ లేకపోవడంతో పరిస్థితి మరింత గందరగోళంగా మారింది. వృద్ధులు, మహిళా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనగా, కొంతమంది రైతులు రోజంతా వేచి ఉన్నా యూరియా దక్కలేదని వాపోయారు. మరోవైపు, పంటలకు అవసరమైన మోతాదులో యూరియా అందకపోవడంతో సాగు పనులు ఆలస్యమవుతున్నాయని, దిగుబడులపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ, "పంట కాలంలో ఎరువులే ప్రాణం. ఒక్క బస్తా సరిపోదు. భూమి విస్తీర్ణానికి తగ్గట్టు యూరియా ఇవ్వాలి. ప్రతి ఏడాది ఇదే పరిస్థితి. అధికారుల నిర్లక్ష్యం వల్లే మేము ఇలా వేడుకోవాల్సి వస్తోంది" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పంట కాలం అత్యంత కీలక దశలో ఉన్న నేపథ్యంలో, జిల్లా అధికారులు వెంటనే జోక్యం చేసుకుని యూరియా సరఫరాను పెంచాలని, పంపిణీ కేంద్రాల్లో క్రమబద్ధమైన క్యూవ్యవస్థతో పాటు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసి రైతులకు న్యాయం చేయాలని రైతులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

# అంబాలలో కోతుల బెడద పోయేనా..?





**సర్పంచ్-ఉప సర్పంచ్‌లు తీసుకుంటున్న వినూత్న చర్యలపై గ్రామంలో చర్చ**

**ప్రజల స్పందనపై మేధావి వర్గాల ఆసక్తి**

**హన్మకొండ జిల్లా, 28 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని అంబాల గ్రామం ప్రస్తుతం కోతుల బెడదతో తీవ్రంగా అల్లాడుతోంది. గత కొంతకాలంగా గ్రామంలో కోతుల సంఖ్య గణనీయంగా పెరగడంతో, గ్రామస్తుల నిత్య జీవితంపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఇళ్లపైకి ఎక్కడం, వంటగదుల్లోకి చొరబడి ఆహార పదార్థాలు ఎత్తుకుపోవడం, తోటలు-పంటలను నాశనం చేయడం, పిల్లలు, వృద్ధులను భయభ్రాంతులకు గురిచేయడం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారాయి. కోతుల భయంతో కొంతమంది గ్రామస్తులు ఇళ్ల తలుపులు మూసుకుని ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో కోతుల గుంపులు వీధుల్లో స్వేచ్ఛగా సంచరిస్తుండటంతో మహిళలు, చిన్నారులు బయటకు రావడానికి కూడా వెనుకాడుతున్నారు. పంట నష్టాల కారణంగా రైతులు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండటంతో, గ్రామమంతటా ఆందోళన వాతావరణం నెలకొంది. ఈ నేపథ్యంలో గ్రామ సమస్యను సీరియస్‌గా తీసుకున్న ప్రస్తుత సర్పంచ్ కుమ్మరి కుమారస్వామి, ఉప సర్పంచ్ శ్రవణ్లు కోతుల బెడదకు తక్షణ పరిష్కారం కనుగొ నేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నారు. ప్రభుత్వ స్థాయిలో శాశ్వత పరిష్కారం రావడానికి సమయం పట్టే అవకాశం ఉండటంతో, తక్షణ ఉపశమనం కల్పించాలనే ఉద్దేశంతో గ్రామస్థులతో కలిసి వినూత్న చర్యలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా గ్రామానికి చెందిన సంగవైని ఓంకార్ తన సొంత ఖర్చులతో ఎలుగుబంటి (బేర్) డ్రెస్‌ను కొనుగోలు చేయడం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఆ డ్రెస్ ధరించి గ్రామ పరిసరాల్లో తిరుగుతూ కోతులను భయపెట్టి తరిమివేయాలనే ప్రయత్నం చేస్తున్నారు. ఈ విధానం ద్వారా కోతులు గ్రామంలోకి ప్రవేశించకుండా అడ్డుకట్ట పడుతుందన్న ఆశాభావం గ్రామస్తుల్లో వ్యక్తమవుతోంది. ఈ చర్యపై గ్రామంలో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. కొందరు గ్రామస్తులు "ఇలాంటి ప్రయత్నాలు తాత్కాలికమైనా కోతుల బెడద నుంచి కొంత ఊరట కలిగిస్తాయి" అంటూ సర్పంచ్, ఉప సర్పంచ్‌లు, ఓంకార్‌ను అభినందిస్తున్నారు. మరికొందరు మాత్రం "ఇది శాశ్వత పరిష్కారం కాదు. అటవీ శాఖ సహకారంతో కోతులను అడవుల్లోకి తరలించేలా దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలి" అని అభిప్రాయపడుతున్నారు. గ్రామ మేధావి వర్గాలు కూడా ఈ ప్రయత్నాన్ని ఆసక్తిగా గమనిస్తున్నాయి. ప్రజల మద్దతు లభిస్తే ఇలాంటి వినూత్న ఆలోచనలతో గ్రామ సమస్యలను ఎదుర్కోవచ్చని వారు భావిస్తున్నారు. అదే సమయంలో, ప్రభుత్వ శాఖల సమన్వయంతో శాస్త్రీయ పద్ధతుల్లో శాశ్వత పరిష్కారం కనుగొనాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. మొత్తానికి, అంబాల గ్రామంలో ప్రారంభమైన ఈ కొత్త ప్రయత్నం కోతుల బెడదను ఎంతవరకు తగ్గిస్తుందో, గ్రామ ప్రజల స్పందన ఎలా ఉంటుందో అన్నది రానున్న రోజుల్లో తేలనుంది. గ్రామ పాలనలో సమస్యలపై సత్వర స్పందన చూపడం ప్రజాప్రతినిధుల బాధ్యతగా భావిస్తున్న గ్రామస్తులు, ఈ చర్యలు విజయవంతమవాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# గత-ప్రస్తుత ప్రభుత్వాల తీరు వల్ల కృష్ణ జలాలు 'చంద్రార్పణం'

**డా. నలమాస శ్రీకాంత్ గౌడ్ తెలంగాణ జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి**

**హైద్రాబాద్, 28 డిసెంబర్ 2025(జై భీమ్ న్యూస్)**

కృష్ణ నది జలాల విషయంలో గత BRS ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరించిన విధాన వైఫల్యాల కారణంగా దక్షిణ తెలంగాణ తీవ్రంగా నష్టపోయిందని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధికార ప్రతినిధి డా. నలమాస శ్రీకాంత్ గౌడ్ విమర్శించారు. నీళ్లు%-%నిధులు%-%నియామకాలే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు యొక్క మూల లక్ష్యాలని గుర్తుచేస్తూ, నీటి వనరుల పరిరక్షణలో ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పునర్వ్యవస్థీకరణ చట్టం%-%2014 ప్రకారం కృష్ణ నది జలాలను మొత్తం 811 టీఎంసీలుగా పరిగణించి, మిగులు జలాల పంపకంపై మాత్రమే నిర్ణయం తీసుకోవాల్సి ఉండగా, ఆ నిబంధనలే తెలంగాణకు నష్టం కలిగించాయని తెలిపారు. 2014 తర్వాత బిఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి బేసిన్‌పై ఎక్కువ దృష్టి సారించి, కృష్ణ బేసిన్‌ను నిర్లక్ష్యం చేయడం వల్ల ఈ ప్రాంత రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. 2015లో నాలుగు రాష్ట్రాలకు కలిపి ట్రిబ్యునల్ కోరడం, అనంతరం సుప్రీంకోర్టులో కేసులు వేయడం వల్ల ఏడేళ్ల పాటు స్పష్టత రాకుండా పోయిందని, మరోవైపు ఆంధ్రప్రదేశ్‌తో ఇంటర్ స్టేట్ అగ్రిమెంట్ ద్వారా 299 టీఎంసీలకు ఒప్పుకోవడం తెలంగాణకు లీగల్‌గా బంధనంగా మారిందని పేర్కొన్నారు. ప్రాజెక్టులు కట్టడమే కాకుండా వాటికి నీటి అలొకేషన్లు సాధించుకోవడమే అసలు కీలకమని, ఆ విషయంలో పాలకులు విఫలమయ్యారని విమర్శించారు. కృష్ణ బేసిన్‌లో కల్వకుర్తి, నెట్టెంపాడు, పాలమూరు%-%రంగారెడ్డి వంటి ప్రాజెక్టులకు సరైన అనుమతులు, అలొకేషన్లు లేకుండానే ముందుకు వెళ్లడం వల్ల ప్రజాధనం వృథా అయ్యిందని అన్నారు. అలాగే నాగార్జునసాగర్, శ్రీశైలం మార్గాల్లో ఆంధ్రప్రదేశ్ అక్రమంగా నీటిని తరలిస్తున్నా, కేంద్రం ఏర్పాటు చేసిన కే.ఆర్.ఎం.బి సమర్థంగా అడ్డుకోలేకపోతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో కల్వకుంట్ల కవిత రాష్ట్రవ్యాప్తంగా ప్రాజెక్టులను సందర్శిస్తూ నీటి అలొకేషన్లపై అధ్యయనం చేస్తున్నారని తెలిపారు. కృష్ణ జలాలపై ఫ్రెష్ అలొకేషన్ సాధించే వరకు తెలంగాణ జాగృతి పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇకనైనా ప్రభుత్వం నిద్ర వీడి తెలంగాణ నీటి హక్కులను కాపాడాలని ప్రజలు కోరుతున్నారని డా. నలమాస శ్రీకాంత్ గౌడ్ అన్నారు.



# జమ్మికుంట మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా మడికొండ సురేందర్ రావు ఎన్నిక

**జమ్మికుంట, 28 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

జమ్మికుంట మండలం సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా మడికొండ సురేందర్ రావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలో మొత్తం 11 మంది సర్పంచులు ఆయనకు మద్దతు తెలిపారు. మడికొండ సురేందర్ రావుకు మద్దతు తెలిపిన సర్పంచుల్లో గంద్రపల్లె సర్పంచ్ తోట కవిత-లక్ష్మణ్, బిజిగిరి షరీఫ్ సర్పంచ్ రాచపల్లి వనజ%-%రాజయ్య, వెంకటేశ్వర్లపల్లె సర్పంచ్ పోల్సాని వినోద%-%నారాయణరావు, శంభునిపల్లె సర్పంచ్ రాసపల్లి కోమల%-%సదానందం, అంకుశాపురం సర్పంచ్ కావడి కుమారస్వామి, సైదాబాద్ సర్పంచ్ పూప్పల రాజారాము, పెద్దంపల్లి సర్పంచ్ ఎగిత పద్మ%-%కుమార్, జగ్గయ్యపల్లె సర్పంచ్ గట్టు హేమలత%-%వీరన్న, నాగంపేట సర్పంచ్ కప్పల పోచయ్య, పాపక్కపల్లె సర్పంచ్ గజవేణి లక్ష్మి%-%ఐలయ్య తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా జమ్మికుంట మాజీ మున్సిపల్ చైర్మన్ తక్కల్లపల్లి రాజేశ్వరరావు, సింగిల్ విండో మాజీ చైర్మన్ పొనగంటి సంపత్, మాదిరెడ్డి వెంకటరెడ్డి, బల్మూరి



సుబ్బారావు, తోట లక్ష్మణ్, మాజీ ఎంపీటీసీ రాజయ్యతో పాటు పలువురు నాయకులు నూతన అధ్యక్షుడిని శాలువాతో ఘనంగా సన్మానించారు. అధ్యక్షుడిగా ఎన్నికైన అనంతరం మడికొండ సురేందర్ రావు మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్క సర్పంచికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ, ప్రజలకు ఎప్పుడూ అందుబాటులో ఉంటానని ఆయన హామీ ఇచ్చారు.

# ఏటీఎం మిషన్‌లో ఇనుప రేకు అడ్డం పెట్టి చోరీలు

**రాజస్థాన్‌కు చెందిన అంతర్‌రాష్ట్ర ముఠా అరెస్టు**

**రూ.5.10 లక్షల నగదు స్వాధీనం**







**వరంగల్, 28 డిసెంబర్ 2025 (జై భీమ్ క్రైమ్ న్యూస్)**

ఏటీఎం కేంద్రాల్లో అత్యంత చాకచక్యంగా చోరీలకు పాల్పడుతున్న రాజస్థాన్‌కు చెందిన అంతర్‌రాష్ట్ర ముఠాను వరంగల్ సిసిఎస్, కాజీపేట పోలీసులు సంయుక్తంగా అరెస్టు చేశారు. ఈ ముఠాకు చెందిన ఏడుగురు నిందితుల నుంచి రూ.5 లక్షల 10 వేల నగదు, రెండు కార్లు, ఏడు సెల్‌ఫోన్లు, ఐరన్ ప్లేట్లు, డూప్లికేట్ తాళం చెవులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల విచారణలో నిందితులు ఏటీఎం మిషన్ ముందు భాగాన్ని నకిలీ తాళంతో తెరిచి, డబ్బులు బయటకు వచ్చే మార్గంలో ఇనుప రేకును గమ్‌తో అమర్చేవారని వెల్లడైంది. దీంతో ఖాతాదారుడు నగదు డ్రా చేసినప్పుడు డబ్బు మిషన్‌లోపలే నిలిచిపోయేది. ఖాతాదారుడు యంత్రంలో సమస్యగా భావించి వెళ్లిపోయిన అనంతరం, మళ్లీ ఏటీఎం తెరిచి లోపల నిలిచిపోయిన నగదును ముఠా చోరీ చేసేది. అయితే ఖాతాదారుడికి మాత్రం డబ్బులు డ్రా అయినట్లు మొబైల్‌కు మెసేజ్ వచ్చేది. ఇదే తరహాలో ఈ ముఠా రాజస్థాన్‌తో పాటు తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్రాల్లో 40కి పైగా ఏటీఎం చోరీలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. వరంగల్ ట్రైసిటీలో మాత్రమే గత నవంబర్ నుంచి ఇప్పటి వరకు 7 ఏటీఎం కేంద్రాల్లో చోరీలు చేసి రూ.12.10 లక్షల నగదును దోచుకున్నట్లు వెల్లడైంది. కాజీపేట చౌరస్తా ప్రాంతంలోని ఓ ఏటీఎం కేంద్రంలో మళ్లీ చోరీకి ప్రయత్నిస్తున్న సమయంలో పోలీసులు నిందితులను పట్టుకున్నారు. పారిపోవడానికి యత్నించిన ముఠాను వెంటాడి అదుపులోకి తీసుకుని విచారించగా నేరాలను అంగీకరించారు. ఈ కేసును ఛేదించిన సిసిఎస్, కాజీపేట పోలీసు బృందాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అభినందించి రివార్డులు అందజేశారు.

# నేడు కలెక్టరేట్‌లో ప్రజావాణి

**జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**




**వరంగల్, 28 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

ఈ నెల 29వ తేదీ (సోమవారం) ఉదయం 10.30 గంటలకు వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. సత్య శారద నేడోక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు.

# ఐనవోలు ఆలయంలో ఒగ్గు పూజారి సస్పెన్షన్

**ఐనవోలు: (జై భీమ్ న్యూస్)**



ఐనవోలు మల్లికార్జున స్వామి ఆలయంలో అదనపు డబ్బులు వసూలు చేశారన్న ఆరోపణలపై ఆలయ ఈవో సుధాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఒగ్గు పూజారి రాజేశ్‌ను విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. ఆదివారం ఆలయంలో పూజా కార్యక్రమాల సమయంలో అదనంగా డబ్బు ఇవ్వలేదని పట్నం ఆపివేశాడన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఆలయ సంప్రదాయాల ప్రకారం ఒగ్గు పూజారులు పూర్వకాలం నుంచి పట్నాలు వేస్తూ వస్తున్నప్పటికీ, భక్తుల నుంచి అనవసర వసూళ్లు చేయడం అనుచితమని ఈవో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఒగ్గు పూజారి రాజేశ్ విధులకు హాజరుకావద్దని ఆదేశాలు జారీ చేశారు. భక్తుల మనోభావాలకు భంగం కలిగించే చర్యలను సహించబోమని, ఆలయ పరిపాలనలో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తామని ఈవో సుధాకర్ తెలిపారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE Jai Bheem TV

# సైబర్ మోసాల ముఠా అరెస్ట్ - 20 ఫిర్యాదులు నమోదు

### ఆదిలాబాద్ జిల్లాలో పెరుగుతున్న సైబర్ నేరాలు

**ఆదిలాబాద్, డిసెంబర్ 28 (జై భీమ్ న్యూస్)**



ఆదిలాబాద్ జిల్లాలో సైబర్ నేరాలు విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. దేశవ్యాప్తంగా సైబర్ నేరగాళ్లు నూతన నూతన పద్ధతుల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, ముఖ్యంగా ఆర్థిక లావాదేవీల విషయంలో అత్యంత జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ వారం జిల్లాలోని సైబర్ క్రైమ్ విభాగంలో మొత్తం 20 ఫిర్యాదులు నమోదు కాగా, వాటిపై విచారణ చేపట్టి పలు కేసుల్లో చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. పోలీసుల వివరాల ప్రకారం, సైబర్ నేరగాళ్లు లోన్ ఫ్రాడ్, జాబ్ ఫ్రాడ్, ఈ%-%కామర్స్ మోసాలు, నకిలీ కస్టమర్ కేర్ కాల్స్, స్టాక్ మార్కెట్ పెట్టుబడుల పేరుతో మోసాలు, అలాగే ఏఐ ఆధారిత వీడియో కాల్స్ ద్వారా ప్రజలను నమ్మబలికి డబ్బులు కాజేస్తున్నారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్‌బీఐ బ్యాంక్ ప్రతినిధులమని చెప్పి ఐదు లక్షల రూపాయల లోన్ ఇస్తామని బాధితుడిని నమ్మబలికి అతని వద్ద నుంచి ?16,600 మోసం చేయగా, మరో ఘటనలో "మీ షో ద్వారా ఆర్డర్ వచ్చింది, డబ్బులు చెల్లించాలి" అంటూ ?10,000 అక్రమంగా కాజేశారు. పట్టణానికి చెందిన ఓ మహిళ ఇన్‌స్టాగ్రామ్ డేటా చోరీకి గురై సైబర్ నేరగాళ్ల బెదిరింపులకు గురవ్వడంతో సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు నమోదు చేసి సమస్యను పరిష్కరించారు. ఇదే విధంగా పాత ?500 నోటుకు లక్ష రూపాయలు ఇస్తామని నమ్మబలికి ?38,000 మోసం చేసిన ఘటనతో పాటు, ఫేస్‌బుక్‌లో పాత నాణేల పేరుతో ?15,000 మోసం చేసిన కేసులు కూడా నమోదయ్యాయి. ఇదే క్రమంలో మావల పోలీస్ స్టేషన్ పరిధిలో మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తామని చెప్పి మోసం చేసిన ఘరానా సైబర్ నేరగాడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆ నిందితుడిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, బీహార్ రాష్ట్రాల్లో కలిపి మొత్తం 37 కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. ఆర్థిక సైబర్ నేరాల్లో 'గోల్డెన్ అవర్' అత్యంత కీలకమని, మోసపోయిన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా జాతీయ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని జిల్లా పోలీసు శాఖ ప్రజలకు సూచించింది.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

### జెండా ఆవిష్కరణ చేసిన మండల అధ్యక్షులు ఇంద్రసేన రెడ్డి



**ఎల్కతుర్తి, 28 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఎల్కతుర్తి మండల కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కూడలి వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఇంద్రసేన రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ శ్రేణులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇంద్రసేన రెడ్డి మాట్లాడుతూ, దేశ స్వాతంత్ర్య పోరాటం నుంచి నేటి ఆధునిక భారత నిర్మాణం వరకు కాంగ్రెస్ పార్టీ చేసిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. విద్య, వైద్యం, పేదల సంక్షేమం, సామాజిక న్యాయం వంటి రంగాల్లో కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన విధానాలు దేశాభివృద్ధికి బలమైన పునాదిగా నిలిచాయని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం అనంతరం ఐఐటీలు, ఎయిమ్స్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యా, వైద్య సంస్థల ఏర్పాటు ద్వారా లక్షలాది యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ దూరదృష్టి స్పష్టంగా కనిపిస్తుందన్నారు. అలాగే తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతోందని తెలిపారు. రైతులకు మేలు చేసే విధానాలు, పేదలకు ఇళ్ల పథకాలు, మహిళలకు ఆర్థిక భద్రత కల్పించే కార్యక్రమాలు, విద్యార్థులకు మెరుగైన విద్యావకాశాలు వంటి అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తోందని చెప్పారు. తెలంగాణను అభివృద్ధి పథంలో నిలబెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ సమానత్వం, సౌభ్రాతృత్వం, న్యాయం అనే సిద్ధాంతాలతో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే నిలిచిందని ఆయన స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో కూడా పార్టీ శ్రేణులు ఐక్యంగా పనిచేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల వరకు తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుఖినే సంతాజీ, మాజీ సింగిల్ విండో చైర్మన్ గోలి రాజేశ్వరరావు, బాబుపేట సర్పంచ్ బత్తిని రవీందర్, దండపల్లి సర్పంచ్ సంపత్, మాజీ సర్పంచ్ గోడిశాల యాదగిరి, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీకాంత్ బక్కి, బావుపేట గ్రామ అధ్యక్షులు లింగమూర్తి, మార్కెట్ డైరెక్టర్ బాబురావు, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అంబాల కుమారస్వామి, పాక రమేష్, డాక్టర్ రమేష్ బాబు, రంజిత్ రెడ్డి, సుమన్, భీమ్ రాజ్, నితిన్, ప్రదీప్, యాదగిరి రాజు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# తెలంగాణ ఆత్మగౌరవాన్ని అణచివేస్తున్నారు

మొదటి పేజీ తరువాయి

పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి తెలియాలన్నారు.సుప్రీంకోర్టులో జరుగుతున్న వాదోపవాదనులను ప్రపంచమంతా వీక్షించే విధంగా లైవ్ టెలికాస్ట్ ను ఏర్పాటు చేస్తూ సుప్రీం ధర్మాసనం ఆదర్శవంతమైన నిజాయితీని దేశానికి కనపరుస్తున్నప్పుడు రాష్ట్ర పరిధిలో జరుగుతున్న అసెంబ్లీ సమావేశాలను ప్రజలకు చేరవేయడానికి జర్నలిజంలో ఆంక్షలు ఏందంటూ సూటిగా ప్రశ్నించారు.నాయకులకు పాలకులకు ప్రజాపాలన ప్రభుత్వంపై నమ్మకం,విశ్వాసం లేకనే మీడియా ప్రతినిధులను అసెంబ్లీ సమావేశాలకు రానివ్వకుండా అడ్డుపడుతూ ఆంక్షలు విధిస్తూ వాళ్ళని అవమానపరచడమే కాకుండా పూర్తిగా అణిచివేస్తున్నారని దుయ్యపట్టారు.రాష్ట్రం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటిపోగా ఇప్పటివరకు జరిగిన అసెంబ్లీ సమావేశాలలో ఎప్పుడూ లేని కొత్త అంకెలను తెరమీదకు తీసుకువచ్చి జర్నలిస్టులను వేధించడం పాలకుల పైచాచిక ఆనందంగా భావించాలన్నారు.రాష్ట్రంలో ఎస్సీ ఎస్టీ ఐఏఎస్ ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని 90 శాతం అధికారులను లూపు లైన్లలో పోస్టింగులు కల్పించి తీవ్ర అన్యాయం చేస్తూ మానసికంగా వేధిస్తున్నారని రాష్ట్రంలో స్థానచలణాలు కల్పించబడుతున్న ఐఏఎస్ ఐపీఎస్ అధికారుల పోస్టింగులు తెలియజేస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సమైక్యవాదాన్ని చూడచక్కగా పాటిస్తున్న పాలకులు ప్రశ్నించే వాళ్లను పూర్తిగా అణిచివేస్తున్నారని తీవ్రంగా ధ్వజమెత్తారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడే15 సంవత్సరాలు కావడం లేనప్పుడు అసెంబ్లీ సమావేశాలకు కవరింగ్ కోసం జర్నలిస్టులకు 15 సంవత్సరాల సంస్థల నిర్మాణ అనుభవాన్ని ఎక్కడినుండి తెచ్చేది అంటూ సూటిగా అడిగారు.ఒకవైపు రాష్ట్రంలో దళితులను అక్రమ కేసుల పాలు చేస్తూ పోలీస్ స్టేషన్లో టాస్క్ ఫోర్స్ స్టేషన్లో రోజుల తరబడి పెట్టుకొని విపరీతంగా కొడుతున్నారని వాటి వల్ల యువత దెబ్బలు తట్టుకోలేక ప్రాణాలు కోల్పోతున్నారన్నారు.నిజాయితీగా జర్నలిజాన్ని నమ్ముకుని జర్నలిజమే ఊపిరిగా బ్రతుకుతున్న జర్నలిస్టులను అవమానపరచడం ప్రభుత్వం కచ్చితంగా మూల్యం చెల్లించుకునే రోజు




వస్తుందని గుర్తు చేశారు.అధికారం ఎవరికి శాశ్వతం కాదని అధికారం ఉంది కదా అని ప్రశ్నించే తత్వాన్ని బలిగొంటామంటే ఎవరి బాబు తరం కాదన్నారు.ప్రజాసేవ కోసం పాలకులు ఎలాంటి ఆత్మ గౌరవాన్ని పాటిస్తున్నారో పాలకులకే వదిలేయాలన్నారు.రాష్ట్రంలో గాని దేశంలో గాని ఉన్న ఏకైక దళిత పత్రిక జైభీమేనని అలాంటి జై భీమ్ ను అణిచివేయడం కోసం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి,ప్రెస్ క్లబ్ అకాడమి చైర్మన్ శ్రీనివాసరెడ్డి,తీవ్రమైన కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు.దేశంలో ఏఐసిసి నేత రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటం ఏంటి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలిస్తున్న పాలన ఏంటో ఏ మాత్రం పొంతన లేకుండా పోతుందన్నారు.దేశం మొత్తం ప్రజాస్వామ్యవాదాన్ని రాజ్యాంగ వాదాన్ని బలంగా కాపాడడం కోసం జై భీమ్ నినాదంతో కదం తొక్కుతున్న రాహుల్ గాంధీని తెలంగాణ రాష్ట్ర పాలకులు ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు.జై భీమ్ అనే పదాన్ని పూర్తిగా అణిచివేయడం కోసం ఆరాటపడుతున్న తెలంగాణ పాలకుల ఆలోచన విధానం ఏంటో బయట పెట్టాలన్నారు.ప్రభుత్వం ప్రభుత్వ పాలకులు అణిచివేసినంత మాత్రాన జై భీమ్ టీవీ జై భీమ్ పత్రికకు పోయేదేమీ లేదని ఆన్లైన్ మాధ్యమంలో దేశవ్యాప్తంగా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు.ఇకనుండి ముఖ్యమంత్రి, మంత్రులు, శాసనసభ్యులు ఇతర నాయకులు పత్రిక సమావేశాలు ఏర్పాటు చేసే ముందు మన రాష్ట్ర ఆవిర్భావ కాలానికి విరుద్ధంగా 15 సంవత్సరాల అనుభవం కలిగిన పత్రికలను టీవీలను ఆంధ్ర మీడియాను మాత్రమే పిలుసుకొని అధికారికంగా గాని అనధికారికంగా గాని పత్రికా సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని హితవు పలికారు.రాష్ట్ర పాలకుల వ్యాపారాలను లావాదేవీలను అధికార హోదాలలో జరుగుతున్న లొసుగులను అక్రమాలను ఆధిపత్యాలను ప్రశ్నిస్తున్నందునే జై భీమ్ సంస్థపై అణిచివేత ధోరణిని కొనసాగిస్తున్నారన్నారు.పత్రిక సమావేశాలలో దళితులపై ఎక్కడ లేనంత ప్రేమానురాగాలను కనబరుస్తున్న పాలనాధికారులు క్రియా రూపకంగా మాత్రం పక్కా అణచివేతను ప్రదర్శిస్తున్నారు అన్నారు.ప్రధానంగా తెలంగాణ రాష్ట్ర పాలకులు గమనించాల్సింది సుప్రీం ధర్మాసనం కన్నా అసెంబ్లీ సమావేశాలు పెద్దవేమి కాదని గుర్తించాలన్నారు.రాష్ట్ర ప్రెస్ అకాడమీ జోకుడుకు ప్రభుత్వం తెగ మురిసిపోతుందని తెలంగాణ రాష్ట్రంలో జర్నలిస్టు వృత్తి నిర్వహించాలంటే కత్తి మీద సాము లాగా మారిపోయిందన్నారు.నాయకుల పరిజ్ఞానం ఏమోగానీ తెలంగాణను ఆగం చేయడంలో మాత్రం అందరూ ఏకమవుతున్నారన్నారు.తెలంగాణ రాష్ట్రంలో కొనసాగుతున్న పాలన పేరేంటో పాలనాధికారులు వివరిస్తే బాగుంటుందన్నారు.మీడియా సంస్థల నిర్మాణ అనుభవమా.... వ్యక్తిగత .... దేన్ని పరిగణలోనికి తీసుకుంటున్నారో తెలియదు గాని పాలన అధికారం ముసుగులో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఒకసారిగా జర్నలిస్టులను అణిచివేసే కక్షలను పెంచి పోషిస్తుంది అన్నారు.అనుభవాలు నేర్పిన పాఠాలు ఆదర్శంగా సమాజంలో నిజాయితీగా నిలబడాలనే మొండిపట్టు ఏమో తెలియదుగాని జర్నలిజం అంటే ఊపిరి జర్నలిజం అంటే ప్రాణం జర్నలిజం అంటే జీవితం సమాజ రక్షణే ప్రధాన లక్ష్యంగా కొనసాగుతున్న జర్నలిస్టులను ప్రభుత్వం గౌరవించకపోతే రానున్న కాలంలో భారీ ఎత్తున మూల్యం చెల్లించుకునే పరిస్థితిలు తప్పవన్నారు.అసెంబ్లీ సమావేశాల ఆహ్వాన అర్హతలపై రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డిని వివరణ కోసం సంప్రదించగా వివరాలు తెలుపుట కొరకు స్పందించలేదు.

# సీఎం చంద్రబాబును కలిసిన హోంగార్డ్స్ యూనియన్ సభ్యులు





### సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ ఆధ్వర్యంలో కలిశారు

### హోంగార్డ్ ల సమస్య పరిష్కరించాలని సిఫారసు లేక సమర్పించిన కే రామకృష్ణ

### ఇరు రాష్ట్రాల హోంగార్డులో ఎంతో నష్టపోతున్నారు

**ఆంధ్రప్రదేశ్ జై భీమ్ న్యూస్ :**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో నియమితులైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల స్థానికత కలిగిన హోంగార్డులను సొంత రాష్ట్రాలకు బదిలీ చేయించేందుకుగాను, వారి సమస్యలు, డిమాండ్లను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ.. సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణ ఆధ్వర్యంలో హోంగార్డుల సంఘం యూనియన్ సభ్యులు ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడును కలిసి వాళ్ళ బాధ చెప్పుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జూన్, 2014 తరువాత ఆంధ్రప్రదేశ్ స్థానికతకు చెందిన హోమ్ గార్డ్స్ తెలంగాణలో ఉండిపోవాలసి వచ్చింది. అన్ని ప్రభుత్వ శాఖలలో ఉద్యోగులను వారిక స్థానికత ప్రకారం మార్చినప్పటికీ, హోంగార్డులను మార్చలేదు. హోంగార్డ్స్ కానిస్టేబుల్ గా చాలా మంది రిక్రూట్ అయ్యారు అదేవిధంగా హోంగార్డ్ పోస్టులు చాలా ఖాళీగా ఉన్నాయి వాటిలలో మాకు అవకాశం ఇయ్యాలని కోరుకుంటున్నాం రాష్ట్రంలోని హోగార్డుల సమస్యల పరిష్కారంపైన, తెలుగు రాష్ట్రాల మధ్య బదిలీల వ్యవహారంపైన కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దురదృష్టకరం. నిత్యం తమ విధులతోను, కుటుంబాలకు దూరంగా ఉంటూ అంకిత భావమైన సేవలందిస్తున్న విషయం మీకు విదితమే. 15 సంవత్సరాల క్రితం ఉమ్మడి హోమ్ గార్డు ఉద్యోగం కోసం తెలంగాణలోను, కుటుంబం ఆంధ్రప్రదేశ్‌లోను ఉంటూ వారి విధులు కొనసాగిస్తున్నారు. హోంగార్డుల అసలు విధులతోపాటు మంత్రులు, పోలీసు ఉన్నతాధికారుల ఇళ్లల్లో అనధికారిక సేవలకు వినియోగించుకుంటున్నారు. హోమ్ గార్డుల ఉద్యోగం తెలంగాణలోను, కుటుంబం ఆంధ్రప్రదేశ్‌లో ఉండటం వలన వారు మానసికంగాను, కుటుంబపరంగాను విధులకు వెళ్లడానికి రవాణపరంగా, ఆర్థికంగా సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. అదే తరహాగా తెలంగాణ రాష్ట్రానికి చెందిన హోంగార్డులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్ర విభజన జరిగి దాదాపుగా 11సంవత్సరాలు అవుతున్నప్పటికీ, స్వరాష్ట్రాలకు వెళ్లాలని ఎదురుచూస్తున్న హోమ్ గార్డుల సమస్యల్ని ఇప్పటికే అనేక మార్లు మీ దృష్టికి, హోంమంత్రి వంగలపూడి అనిత గారికి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకొచ్చినా పరిష్కారమవ్వలేదు. తమరు హోమ్ గార్డుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తెలంగాణలో పనిచేస్తున్న వారిని రాష్ట్రానికి వచ్చేలా కృషిచేయాలని అనేకసార్లు మీకు లేఖలు రాసినప్పటికీ, మీ ప్రభుత్వం పట్టించుకోలేదు. హోమ్ గార్డుల తల్లిదండ్రులు వృద్ధాప్యంలో ఉండంటం వలన, వారిని చూసుకోలేకపోతున్నారు. ఒక వైపు వారి పిల్లలు తెలంగాణలోను, ఆంధ్రప్రదేశ్‌లోను చదువుతున్నారు. వారి బదిలీలు సకాలంలో కొనసాగకపోవడంతో భవిష్యత్తులో రాష్ట్ర స్థానికతను కోల్పోవాలిసి వస్తుంది. చిన్నస్థాయి ఉద్యోగులు, వారి కుటుంబ, ఆర్థిక పరిస్థితులు దృష్టా హోంగార్డులు తెలంగాణలో పనిచేయడం ఉండిపోవడం వలన వారి కుటుంబాల పరిస్థితి హోమ్ గార్డుల తల్లితండ్రులు వృద్ధాప్యంలో ఉండంటం వలన, వారిని చూసుకోలేకపోతున్నారు. హోమ్ గార్డుల పిల్లలు తెలంగాణలో చదువుతున్నారు. వారు భవిష్యత్తులో రాష్ట్ర స్థానికతను కోల్పోవాలిసి వస్తుంది. హోమ్ గార్డుల చిన్న స్థాయి ఉద్యోగులు, వారి కుటుంబం, ఆర్థిక పరిస్థితులు దృష్టా హోంగార్డులు తెలంగాణలో పనిచేస్తూ ఉండిపోవడం వల్ల వారి కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఇప్పటికైనా మీ ప్రభుత్వం సత్వరమే స్పందించి హోంగార్డుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతున్నాం.

# డెస్క్ జర్నలిస్టులకు పూర్తి స్థాయి న్యాయం తప్పదు

**బస్ పాస్‌లతో సహా అన్ని సంక్షేమ పథకాలు వర్తింపజేస్తాం**
**అవాస్తవాలతో తప్పుదారి పట్టించొద్దు**
**టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ**




**హైద్రాబాద్, 28 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

డెస్క్ జర్నలిస్టుల పట్ల ప్రభుత్వం అన్యాయం చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదని, బస్ పాస్‌లతో సహా అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలను వారికి వర్తింపజేసేలా ప్రభుత్వంతో చర్చించి పూర్తి స్థాయిలో న్యాయం చేస్తామని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ స్పష్టం చేశారు. డెస్క్ జర్నలిస్టులను ఇతర జర్నలిస్టుల నుంచి వేరుగా చూడబోమని, వారికీ అన్ని సంక్షేమ పథకాలు తప్పనిసరిగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఆదివారం బషీర్‌బాగ్‌లోని యూనియన్ కార్యాలయంలో జరిగిన టీయూడబ్ల్యూజే రాష్ట్ర ముఖ్యుల సమావేశం అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత పదేళ్లలో డెస్క్ జర్నలిస్టులకు కొంతమందికే అక్రిడేషన్ కార్డులు లభించాయని, ఇప్పుడు డెస్క్‌లో పనిచేసే అర్హులైన జర్నలిస్టులందరికీ మీడియా కార్డులు అందించేందుకు తమ సంఘం కృషి చేస్తోందన్నారు. హెల్త్ కార్డులు సహా అన్ని సంక్షేమ పథకాలు అమలయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని తెలిపారు. జర్నలిజంలో విలువలు కాపాడేందుకే రాష్ట్ర ప్రభుత్వం కట్టుదిట్టమైన నిబంధనలతో జీవో 252 తీసుకొచ్చిందని, డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరుగుతోందంటూ కొందరు అవాస్తవాలతో అపోహలు సృష్టిస్తున్నారని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఇచ్చిన అక్రిడేషన్ కార్డులు ఎంతవరకు ఉపయోగపడ్డాయో ప్రతి జర్నలిస్టుకూ తెలుసునని, జర్నలిస్టులను తీవ్రంగా నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వానికి అనుకూలంగా ఉన్న సంఘాలే నేడు ఆందోళనలకు దిగుతున్నాయని ఎద్దేవా చేశారు. సహేతుకమైన పోరాటాలకు టీయూడబ్ల్యూజే మద్దతు ఉంటుందని, అయితే అబద్ధాలు, కల్పితాలతో చేసే ప్రచారాన్ని నమ్మవద్దని కోరారు. అక్రిడేషన్ కార్డుల సంఖ్య ముఖ్యం కాదని, వాటితో ఎంతమంది జర్నలిస్టులకు సంక్షేమ పథకాలు అమలయ్యాయో చెప్పాలని హితవు పలికారు. 1996కు ముందు ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 3 వేల అక్రిడేషన్ కార్డులే ఉండగా, గ్రామీణ విలేకరుల కోసం పోరాడి మండలాల వారీగా అక్రిడేషన్లు సాధించుకున్న చరిత్ర టీయూడబ్ల్యూజేదేనన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 12 వేల వరకు అక్రిడేషన్లు పెరిగిన ఘనత తమదేనని గుర్తు చేశారు. గతంలో జీవో 239తో చిన్న, మధ్యతరగతి, ఉర్దూ పత్రికలకు జరిగిన అన్యాయంపై అప్పటి పాలకులు, సంఘాలు ఎందుకు మౌనంగా ఉన్నాయో ప్రశ్నించారు. అక్రిడేషన్ కార్డుల దుర్వినియోగం, జర్నలిజం వృత్తితో సంబంధం లేని వారికి కార్డులు దక్కిన ఘటనలు వృత్తి విలువలకు మచ్చతెచ్చాయని, అటువంటి పరిస్థితులు పునరావృతం కాకుండా గౌరవం నిలబెట్టేందుకే జీవో 252 తీసుకొచ్చారని వివరించారు. అయితే జీవో 252లో ఉన్న కొన్ని లోటుపాట్లను గుర్తించామని, వాటిని సవరించేందుకు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్, మీడియా కార్డులు అందేలా తమ సంఘం నిరంతరం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రాంనారాయణ, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, ఉపాధ్యక్షుడు గాడిపల్లి మధు, కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వరకాల యాదగిరి, జి. మధు గౌడ్, కోశాధికారి యం. వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏ. రాజేష్, తెలంగాణ చిన్న%-%మధ్యతరగతి పత్రికల సంఘం అధ్యక్షుడు యూసుఫ్ బాబు, హెచ్‌యూజే అధ్యక్షుడు శిగా శంకర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవం





**త్యాగాలు-బలిదానాల పునాదులపై నిలిచిన ప్రజా ఉద్యమమే కాంగ్రెస్ : ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు**

**హన్మకొండ, 28 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ 141వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హన్మకొండ డిసిసి భవన్‌లో ఘనంగా వేడుకలు నిర్వహించారు. హన్మకొండ డిసిసి అధ్యక్షులు, వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ అయూబ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేఆర్ నాగరాజు, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ 141 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర దేశ స్వాతంత్ర్య పోరాటంతో ప్రారంభమై నేటి ప్రజాస్వామ్య పరిరక్షణ వరకు ప్రజల ఆశయాలతో ముడిపడి ఉందని అన్నారు. త్యాగాలు, బలిదానాలు, ప్రజా ఉద్యమాల పునాదులపై నిర్మితమైన పార్టీయే కాంగ్రెస్ అని పేర్కొన్నారు. పేదలు, రైతులు, కార్మికులు, మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాలు మరియు మైనార్టీల హక్కుల పరిరక్షణే కాంగ్రెస్ పార్టీ ధ్యేయమని స్పష్టం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం సాధించడంలో మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ వంటి మహానాయకుల సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సామ్యవాద భావజాలంతో విద్య, వైద్యం, ఉపాధి వంటి మౌలిక హక్కులను ప్రజలకు అందించడంలో కాంగ్రెస్ పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రైతు భరోసా, మహిళల సంక్షేమం, పేదల నివాసం, సామాజిక భద్రతా పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చేందుకు కృషి చేస్తోందని తెలిపారు. పాలనలో పారదర్శకత, బాధ్యతతో పాటు ప్రజలతో నేరుగా మమేకమై సమస్యలను పరిష్కరించే విధానాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తోందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే రాజకీయాల లక్ష్యమని, అధికారం కోసం కాకుండా ప్రజల సేవకే కాంగ్రెస్ పార్టీ అంకితమై ఉందని ఎమ్మెల్యే నాగరాజు స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేయాలంటే నాయకులు, కార్యకర్తలు ప్రతి గ్రామం, ప్రతి బూత్‌లో ప్రజల మధ్య ఉండి పార్టీ విధానాలను వివరించాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే 141వ ఆవిర్భావ దినోత్సవానికి నిజమైన నివాళి అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హన్మకొండ జిల్లాల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు కేఆర్ దిలీప్ రాజ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరివి పరమేష్, ఈ.వి. శ్రీనివాస్‌తో పాటు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, సేవాదళ్, యూత్ కాంగ్రెస్, మహిళా కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# సంగారెడ్డి ఫ్యాక్టరీ ప్రమాదం ఆరు నెలల తర్వాత సిగాచి ఎండీ అరెస్ట్

**54 మంది మృతి కేసులో కీలక పరిణామం**
**సంగారెడ్డి ఫ్యాక్టరీ ప్రమాదం కేసులో సిగాచి ఎండీ అరెస్ట్**
**అమిత్ రాజ్ సిన్హాకు జ్యుడీషియల్ కస్టడీ విధించిన కోర్టు**
**దర్యాప్తు జాప్యంపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన నేపథ్యంలో అరెస్ట్**

**సంగారెడ్డి, జై భీమ్ న్యూస్**

తెలంగాణలోని సంగారెడ్డి జిల్లాలో 54 మంది కార్మికుల ప్రాణాలు బలిగొన్న భారీ అగ్నిప్రమాదం జరిగిన ఆరు నెలల తర్వాత, సిగాచి ఇండస్ట్రీస్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ అమిత్ రాజ్ సిన్హాను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం ఆయన్ను మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా, న్యాయస్థానం జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. ఈ అరెస్ట్ విషయాన్ని సిగాచి కంపెనీ బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు అధికారికంగా తెలియజేసింది. అగ్నిప్రమాద ఘటనపై జరుగుతున్న విచారణలో భాగంగా శనివారం అమిత్ రాజ్ సిన్హాను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొంది. కంపెనీ కార్యకలాపాలు యథాతథంగా కొనసాగుతాయని, డిప్యూటీ గ్రూప్ సీఈఓ లిజా స్టీఫెన్ చాకో తాత్కాలికంగా బాధ్యతలు చూస్తారని వెల్లడించింది. ఈ ఏడాది జూన్ 30న పశమైలారంలోని సిగాచి పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి, పెద్ద ఎత్తున మంటలు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో 54 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరో 33 మంది గాయపడ్డారు. ఈ ప్లాంట్‌లో టాబ్లెట్లు, క్యాప్సూల్స్‌లో ఉపయోగించే మైక్రోక్రిస్టలైన్ సెల్యులోజ్ పౌడర్‌ను తయారు చేస్తారు. ఈ ఘటనపై బీడీఎల్-భానూర్ పోలీసులు కంపెనీ యాజమాన్యంపై బీఎన్ఎస్ సెక్షన్ 105 కింద కేసు నమోదు చేశారు. అయితే, ఇన్ని రోజులుగా అరెస్టులు జరగకపోవడంపై విమర్శలు వచ్చాయి. ఈ కేసులో దర్యాప్తు జాప్యంపై గత నెలలో తెలంగాణ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఓ ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) విచారణ సందర్భంగా, విచారణాధికారిని కోర్టుకు పిలిపించి కేసుకు సంబంధించిన అన్ని పత్రాలను సమర్పించాలని ఆదేశించింది. హైకోర్టు జోక్యం చేసుకున్న కొద్ది రోజులకే ఈ అరెస్ట్ జరగడం గమనార్హం. మృతుల కుటుంబాలకు రూ. 1 కోటి చొప్పున పరిహారం చెల్లించడానికి సిగాచి యాజమాన్యం అంగీకరించినట్లు రాష్ట్ర ప్రభుత్వం గతంలో హైకోర్టుకు తెలిపింది.

# “జీవితం నీదే.. గమ్యం కూడా నీదే”

**యువతకు స్ఫూర్తినిచ్చిన అనిల్ కాందారి సందేశం**



**హైద్రాబాద్, 28 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

జీవితం, స్వప్నం, గమ్యం అన్నీ మన చేతుల్లోనే ఉన్నాయని, గెలుపు-ఓటమి, కష్టం-శ్రమ అన్నీ వ్యక్తిగత ప్రయాణంలో సహజ భాగాలేనని అనిల్ కాందారి, హ్యూమన్ రైట్స్ యాంటీ కరప్షన్ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నారు. కష్టకాలంలో ఇతరుల స్పందనలపై ఆధారపడకుండా, స్వయంకృషి మరియు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆయన యువతకు హితవు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జీవితంలో పడిపోవడం సహజమేనని, కానీ మళ్లీ లేచి నిలబడాల్సింది మనమేనని స్పష్టం చేశారు. బాధను, గాయాన్ని దిగమింగుకొని ధైర్యంగా ముందుకు నడవడం తప్ప మరో మార్గం లేదని పేర్కొన్నారు. “ఇతరులు కేవలం చోద్యం చూస్తారు%ౡ% వీలుంటే ఎగతాళి చేస్తారు. అలాంటి మాటలకు విలువ ఇస్తే మన ప్రయాణమే ఆగిపోతుంది” అని ఆయన వ్యాఖ్యానించారు. ప్రతి వ్యక్తి తన జీవితానికి తానే బాధ్యుడని, విజయం సాధించాలంటే నిరంతర శ్రమ తప్పనిసరి అని అనిల్ కాందారి తెలిపారు. గెలుపు వచ్చినా, ఓటమి ఎదురైనా అది మనల్ని మరింత బలంగా తీర్చిదిద్దే అనుభవమేనని చెప్పారు. పరిస్థితులను నిందించకుండా, అవకాశాలను సృష్టించుకునే దృక్పథం యువతలో పెరగాలని ఆయన సూచించారు. “ఎవరేమన్నా సరే%ౡ% లక్ష్యాన్ని కళ్లముందు పెట్టుకొని, నిశ్శబ్దంగా ముందుకు సాగితే విజయం తప్పక మనదే” అని ఆయన స్పష్టం చేశారు. అనిల్ కాందారి ఇచ్చిన ఈ సందేశం స్థానికంగా యువతలో మంచి స్పందనను పొందుతూ, కష్టకాలంలో ధైర్యం కోల్పోతున్న అనేక మందికి స్ఫూర్తినిచ్చే ప్రేరణాత్మక వ్యాఖ్యలుగా నిలిచింది.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మడిపల్లిలో 20 కుట్టు మెషీన్ల పంపిణీ

**పేద మహిళల ఉపాధికి చేయూత**





**హసన్ పర్తి, 28 డిసెంబర్ 2025 (జై భీమ్ న్యూస్)**

పేద మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో మడిపల్లి గ్రామంలో 20 కుట్టు మెషీన్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ ప్రతినిధులు అంచూరి విజయ్ కుమార్, మడిపల్లి గ్రామ నూతన సర్పంచ్ బుర్ర రంజిత్ కుమార్ నేతృత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, గ్రామీణ మహిళలు ఇంటి నుంచే ఉపాధి పొందుతూ ఆర్థికంగా స్వావలంబన సాధించే దిశగా ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళా సాధికారతే రోటరీ క్లబ్ ముఖ్య లక్ష్యమని, సమాజ సేవలో భాగంగా ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. కుట్టు మెషీన్ల పంపిణీతో మహిళలు కుటుంబ బాధ్యతలతో పాటు ఉపాధిని సమన్వయం చేసుకుంటూ కుటుంబ ఆదాయాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. లబ్ధిదారులైన మహిళలు ఈ సహాయానికి రోటరీ క్లబ్‌కు కృతజ్ఞతలు తెలియజేస్తూ, ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటామని అన్నారు. భవిష్యత్తులో కూడా విద్య, ఆరోగ్యం, ఉపాధి రంగాల్లో సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపడతామని రోటరీ క్లబ్ ప్రతినిధులు వెల్లడించారు.

# అసెంబ్లీ సమావేశాల కోసం హైదరాబాద్ చేరుకున్న కేసీఆర్

**బీఆర్ఎస్‌లో ఉత్సాహం**
**నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలకు హాజరుకానున్న కేసీఆర్**
**హైదరాబాద్‌లోని తన నివాసానికి చేరుకున్న బీఆర్ఎస్ అధినేత**
**పాలమూరు-రంగారెడ్డి పథకంపై పోరాటానికి సిద్ధం కావాలని నేతలకు పిలుపు**
**ప్రభుత్వ ఎజెండాను బట్టి వ్యూహం రచించాలని పార్టీ నేతలకు సూచన**

**హైదరాబాద్, జై భీమ్ న్యూస్**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలకు బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) హాజరుకానున్నారు. నేటి (డిసెంబరు 29) నుంచి జరగనున్న ఈ సమావేశాలకు తాను హాజరవుతున్నట్లు పార్టీ నేతలతో కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో ఆయన ఆదివారం సాయంత్రం ఎర్రవల్లిలోని తన ఫాంహౌస్ నుంచి హైదరాబాద్‌లోని నంది నగర్ నివాసానికి చేరుకున్నారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలపై కేసీఆర్ పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. అధికార కాంగ్రెస్ పార్టీ ఏ ఎజెండాతో ముందుకు వస్తుందో గమనించి, దానికి అనుగుణంగా దీటుగా స్పందించాలని సూచించారు. ముఖ్యంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై అసెంబ్లీ లోపల, బయట బలమైన పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కాగా, అసెంబ్లీ సమావేశాల కోసం కేసీఆర్ హైదరాబాద్‌కు రావడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వంపై కేసీఆర్ మీడియా సమావేశంలో తీవ్ర విమర్శలు చేయగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అంతేస్థాయిలో బదులిచ్చారు. ఈ మాటల యుద్ధం తర్వాత జరుగుతున్న తొలి అసెంబ్లీ సమావేశాలు కావడంతో ఇవి అత్యంత ఆసక్తికరంగా మారాయి. అధికార, ప్రతిపక్షాల మధ్య వాడీవేడీ చర్చలు, ఆరోపణలతో సభ దద్దరిల్లనుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక POWER OF PEOPLE




# రాజు వెడ్స్ రాంబాయి... కొత్త యూజర్లకు ఈటీవీ విన్ ఆఫర్

అఖిల్, తేజస్విరావ్ జంటగా నటించిన 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రం బాక్సాఫీస్ వద్ద ఘన విజయం సాధించడమే కాకుండా, ఓటీటీలోనూ సంచలన రికార్డులు నెలకొల్పుతోంది. ఈ చిత్రానికి సాయిలు కంపాటి దర్శకత్వం వహించారు. దర్శకుడు వేణు ఊడుగులతో కలిసి రాహుల్ మోపిదేవి నిర్మించగా, చైతు జొన్నలగడ్డ, అనిత చౌదరి తదితరులు ముఖ్య పాత్రల్లో కనిపించారు. ఈ నెల 18 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక ఈటీవీ విన్‌లో స్ట్రీమింగ్ అవుతున్న ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఇప్పటివరకు ఈ చిత్రం 100 మిలియన్ స్ట్రీమింగ్ నిమిషాలను దాటినట్లు ఈటీవీ విన్ అధికారికంగా వెల్లడించింది. థియేటర్లలో 2 గంటల 15 నిమిషాల నిడివితో విడుదలైన ఈ చిత్రం, ఓటీటీలో ప్రేక్షకులను మరింత ఆకట్టుకునేలా ఎక్స్‌టెండెడ్ కట్‌తో స్ట్రీమింగ్ అవుతోంది. ఈ విజయోత్సాహంలో భాగంగా ఈటీవీ విన్ ప్రత్యేక ఆఫర్‌ను కూడా ప్రకటించింది. నెలవారీ ప్రీమియం సబ్‌స్క్రిప్షన్ తీసుకునేవారు %=ఔ=%50 కోడ్‌ను ఉపయోగిస్తే రూ.50 రాయితీ, అలాగే, వార్షిక సబ్‌స్క్రిప్షన్‌కు %=ఔ=%100 కోడ్ ద్వారా రూ.100 తగ్గింపు పొందవచ్చని ప్రకటించింది. 'రాజు వెడ్స్ రాంబాయి' చిత్రాన్ని మళ్లీ మళ్లీ వీక్షిస్తూ ఆదరిస్తున్న ప్రేక్షకులకు ఈటీవీ విన్ ధన్యవాదాలు తెలియజేసింది.

# రజనీకాంత్‌తో ప్రేమకథా చిత్రం

**దర్శకురాలి డ్రీమ్ ప్రాజెక్ట్**




ప్రముఖ దర్శకురాలు సుధా కొంగర, సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో ఓ సినిమా చేయాలన్న తన చిరకాల కోరికను బయటపెట్టారు. అయితే, ఆ సినిమా యాక్షన్ లేదా సందేశాత్మక చిత్రం కాదని, ఓ పూర్తిస్థాయి ప్రేమకథా చిత్రమని చెప్పి ఆసక్తి రేకెత్తించారు. 'గురు', 'ఆకాశం నీ హద్దురా' వంటి విజయవంతమైన చిత్రాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న సుధా ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రస్తుతం ఆమె దర్శకత్వం వహించిన 'పరాశక్తి' సినిమా ప్రమోషన్లలో సుధా కొంగర బిజీగా ఉన్నారు. ఈ సందర్భంగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "నాకు ప్రేమకథలంటే చాలా ఇష్టం. రజనీకాంత్ సర్‌తో ఒక పూర్తిస్థాయి లవ్‌స్టోరీ చేయాలన్నది నా కల. నా దగ్గర ఇప్పటికే ఆయన కోసం ఒక కథ కూడా సిద్ధంగా ఉంది. దాన్ని ఇంకాస్త డెవలప్ చేయాలి" అని ఆమె తెలిపారు. ఇదే సమయంలో ఆమె తన రిటైర్మెంట్ గురించి కూడా మాట్లాడారు. వరుస సినిమాలతో పనిభారం పెరిగిందని, అందుకే త్వరలోనే రిటైర్ అవ్వాలని అనుకుంటున్నట్లు ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. సుధా కొంగర దర్శకత్వంలో వస్తున్న 'పరాశక్తి' పొలిటికల్ పీరియాడికల్ డ్రామాగా తెరకెక్కుతోంది. ఈ చిత్రంలో శివకార్తికేయన్ హీరోగా, శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తుండగా.. అథర్వ, రవి మోహన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా 2026 జనవరి 10న విడుదల కానుంది. సుధా కొంగర తాజా వ్యాఖ్యలతో రజనీకాంత్‌తో ఆమె డ్రీమ్ ప్రాజెక్ట్ ఎప్పుడు పట్టాలెక్కుతుందా అని అభిమానులు, సినీ వర్గాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

# 'ధురంధర్' స్టార్ అక్షయ్ ఖన్నాకు లీగల్ నోటీసు పంపిన 'దృశ్యం 3' నిర్మాత



బాలీవుడ్‌లో మరో లీగల్ వివాదం కలకలం రేపింది. 'ధురంధర్' స్టార్ అక్షయ్ ఖన్నా తమ తాజా చిత్రం 'దృశ్యం 3' కోసం చేసుకున్న ఒప్పందాన్ని ఉల్లంఘించారంటూ ఆ సినిమా నిర్మాత కుమార్ మంగత్ పాఠక్ ఆయనకు లీగల్ నోటీసు పంపారు. ఈ సినిమాలో తాను భాగం కావడం లేదని అక్షయ్ ఖన్నా టెక్స్ట్ మెసేజ్ ద్వారా తెలియజేశారని నిర్మాత తెలిపారు. అయితే, షూటింగ్ కోసం ముందుగానే కొంత మొత్తం అడ్వాన్స్‌గా చెల్లించామని, అప్పుడు ఒప్పందం కూడా జరిగిందని తెలిపారు. 'దృశ్యం 3' కోసం రెండేళ్లుగా పనిచేస్తున్నామని... ఆ స్క్రిప్ట్ విన్నప్పుడు అక్షయ్ కు కూడా నచ్చిందని... ఆ తర్వాతే ఆయనతో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. అయితే, ఈ సినిమా చేయడం లేదని హఠాత్తుగా మెసేజ్ పంపారని తెలిపారు. ఆయనను సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ... అందుబాటులోకి రాలేదని చెప్పారు. ఈ క్రమంలోనే అక్షయ్ కు నోటీసులు పంపించామని తెలిపారు. మరోవైపు, అక్షయ్ స్థానంలో జైదీప్ అహ్లావత్ ను తీసుకున్నామని చెప్పారు.



# సినిమా టికెట్ల ధర పెంపుపై మాధురి దీక్షిత్ ఆసక్తికర వ్యాఖ్యలు

ఒకప్పుడు సినిమా చూడాలంటే థియేటర్ ఒక్కటే మార్గం. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ముఖ్యంగా కరోనా తర్వాత థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య గణనీయంగా తగ్గింది. దీనికి అసలు కారణాలేంటో బాలీవుడ్ అందాల నటి మాధురీ దీక్షిత్ విశ్లేషించారు. విపరీతంగా పెరిగిపోయిన సినిమా టికెట్ల ధరలు, ఓటీటీ ప్లాట్‌ఫామ్‌ల అందుబాటు వంటి అంశాలు ప్రేక్షకులు థియేటర్లకు దూరం కావడానికి ప్రధాన కారణాలని ఆమె అభిప్రాయపడ్డారు. ఐఏఎన్ఎస్ వార్తా సంస్థతో ప్రత్యేకంగా మాట్లాడుతూ ఆమె ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "సినిమా బాగుంటే ప్రేక్షకులు తప్పకుండా థియేటర్లకు వస్తారు. ఈ మధ్య కాలంలో కొన్ని సినిమాలు ఎంత పెద్ద విజయం సాధించాయో మనం చూశాం. కాబట్టి, జనం రావడం లేదనడం సరికాదు. కానీ అసలు సమస్య టికెట్ ధరలతోనే ఉంది. ప్రస్తుతం ఒక కుటుంబం అంతా కలిసి సినిమాకు వెళ్లాలంటే భారీగా ఖర్చు చేయాల్సి వస్తోంది. దీంతో ఏ సినిమాకు వెళ్లాలి, ఏది వాయిదా వేయాలి అని వాళ్లు ప్రత్యేకంగా బడ్జెట్ వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది" అని మాధురీ దీక్షిత్ వివరించారు. ఓటీటీల ప్రభావం గురించి మాట్లాడుతూ, "ఓటీటీల వల్ల సినిమాలు ఇప్పుడు మన చేతివేళ్లపైనే అందుబాటులో ఉన్నాయి. ఉద్యోగాల నుంచి ఇంటికి వచ్చేసరికి రాత్రి 8:30 లేదా 9:00 అవుతోంది. ఆ తర్వాత మళ్లీ థియేటర్‌కు వెళ్లడం చాలా మందికి కష్టంగా మారింది. దీంతో వారాంతాల్లో లేదా సెలవు రోజుల్లో మాత్రమే సినిమాకు వెళ్లేందుకు అవకాశం దొరుకుతోంది. అదే ఓటీటీలో అయితే, మనకు నచ్చిన సమయంలో, నచ్చిన చోట సినిమా చూసే సౌలభ్యం ఉంది. పైగా ఇంట్లోనే పాప్‌కార్న్ వంటివి తయారు చేసుకుని, కుటుంబంతో కలిసి సినిమా చూడటం తక్కువ ఖర్చుతో కూడుకున్న పని" అని తెలిపారు. అయితే, ఈ పరిణామాల వల్ల సినిమా భవిష్యత్తు అంధకారంలో పడిపోయిందని తాను భావించడం లేదని మాధురి స్పష్టం చేశారు. "సినిమా భవిష్యత్తుకు వచ్చిన ముప్పేమీ లేదు. కాకపోతే కొన్ని విషయాలను సరిదిద్దుకోవాలి. ప్రేక్షకులకు థియేటర్ అనుభవాన్ని మరింత మెరుగ్గా, అందుబాటు ధరలో అందించగలిగితే మునుపటి రోజులు మళ్లీ వస్తాయి" అంటూ ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# మలేసియాలో ఆడియో వేడుకలో పార్టీ నినాదాలు.. వారించిన హీరో విజయ్



ప్రముఖ తమిళ నటుడు విజయ్ నటించిన 'జననాయగన్' చిత్రం ఆడియో విడుదల వేడుకలో టీవీకే పార్టీ నినాదాలు వినిపించాయి. అయితే ఆడియో విడుదల వేడుక కార్యక్రమంలో రాజకీయపరమైన వ్యాఖ్యలు చేయకూడదన్న ఆంక్షల నేపథ్యంలో ఆయన అభిమానులను వారించారు. 'జననాయగన్' ఆడియో విడుదల కార్యక్రమం మలేసియా రాజధాని కౌలాలంపూర్‌లో ఘనంగా జరిగింది. టీవీకే పార్టీని స్థాపించిన విజయ్‌కి ఇది చివరి చిత్రం కావడంతో అభిమానులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఆడియో విడుదల కార్యక్రమంలో భాగంగా విజయ్ వేదిక పైకి రాగానే అతనికి, పార్టీకి అనుకూలంగా నినాదాలు మార్మోగాయి. కొంతమంది 'టీవీకే.. టీవీకే' అని నినాదాలు చేయగా ఆయన సున్నితంగా వారించారు. ఈ వేదికపై అలాంటి వ్యాఖ్యలు చేయవద్దని చేతి సంజ్ఞతో పేర్కొన్నారు.